
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

సోమవారం, 24 ఫిబ్రవరి 2025






## ముగిసిన కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

### ఓవరాల్ ఛాంపియన్‌గా ఎంసీఎల్ కంపెనీ



పరుగుపందెంలో పోటీపడుతున్న క్రీడాకారులు

కొత్తగూడెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలకు దేశంలోని 9 బొగ్గు కంపెనీలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎంసీఎల్ (మహానంది కోల్‌లిమిటెడ్) నిలిచింది. ఆదివారం విలువిద్య, షార్ట్‌పుట్, పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు సింగరేణి యాజమాన్యం వసతి కల్పించింది. సింగరేణి జనరల్ మేనేజర్(పర్సనల్) కవితానాయుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. సింగరేణి యాజమాన్యం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి డీజీఎంలు (మిగతా 6వ పేజీలో)

## జిల్లా ఆస్పత్రి స్థలం మాదే !

- మిగులు స్థలాన్ని మాకు కేటాయించాలి
- కోర్టు ఆదేశాలతో కొందరు వ్యక్తులు స్థల ఆక్రమణకు సిద్ధం
- పాత ధర్నాచౌక్ వద్ద అధికారులతో వాగ్వాదం
- పరిశీలించాలంటూ ఆర్డీవోకు ఉన్నతాధికారుల ఆదేశం



వివరాలు : 6లో

## సమస్యల.. సవాల్


శాసనమండలి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధి ఉపాధ్యాయ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులకు విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలు మెచ్చెమటలు పట్టిస్తున్నాయి. రెండుదశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న ఉపాధ్యాయ ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారోనన్న ఆందోళనలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, అభ్యర్థులు కొట్టు మిట్టాడుతున్నారు. ఈనెల 27ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఎన్నికల పోలింగ్ జరగనుండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులు, తమ మద్దతుదారులు, ఉపాధ్యాయసంఘాల నాయకులతో ప్రచారాలు జోరుగా సాగిస్తున్నా ఓటర్ల నాడి అంతుచిక్కడం లేదు.



### ఉపాధ్యాయుల్లో ఆగ్రహావేశాలు

అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమస్యలను పరిష్కరించడంలో నాయకులు, పాలకులను నిలదీయకుండా ఉద్యమాలు చేపట్టకుండా అధికారంలో ఉండే పెద్దలతో దోస్తీలు చేస్తూ తమ స్వకార్యాలు చక్కబెట్టుకోడానికి పరిమితమయ్యారన్న ఆగ్రహావేశాలు ఉపాధ్యాయ ఓటర్లలో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఎలాంటి వైఖరి అవలంభిస్తారోనన్న ఆందోళన బరిలో నిలిచిన అభ్యర్థులను, ఉపాధ్యాయసంఘాలను ముంచెత్తుతోంది.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమస్యలే అజెండా
- అపరిష్కృత సమస్యలతో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి
- టీచర్ల తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



ఇల్లెందు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రచారాలకు వెళ్లిననాయకులను టీచర్లు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరిణామాలు అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. 12జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటర్లను అపరిష్కృత సమస్యలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు పలు సంఘాల నాయకులే పేర్కొంటుండటం గమనార్హం. ప్రభుత్వాలకు అనుకూలంగా ఉన్న సంఘాలకు, వ్యతిరేకంగా ఉద్యమాల ఎజెండా కలిగిన సంఘాలకు గతంలో ఓట్లు వేసి ఎంఎల్‌సీలుగా గెలిపిస్తే ఆశించిన రీతిలో తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్న పార్టీలకు అంటకాగుతున్న సంఘాలను గెలిపించినా తమ సమస్యలు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న రీతిలో ఉన్నాయని ఉపాధ్యాయ ఓటర్లు పేర్కొంటున్నారు.

**హడలెత్తిస్తున్న సమస్యలు..**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం జటిలంగా ఉంది. గతంలో పాలించిన బీఆర్‌ఎస్, గత 14 నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించలేదన్న ఆరోపణలున్నాయి. దశాబ్దాలు దాటుతున్నా తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, తమ సమస్యలను పట్టించుకునే నాదులే కరువయ్యారని టీచర్లు వాపోతున్నారు. 2004లో ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం రద్దు చేయాలని 21 ఏళ్లుగా కోరుతున్నా తమగోడు పట్టించుకోవడంలేదని, దేశంలో ఐదు రాష్ట్రాల్లో సీపీఎస్‌ను తొలగించారని, కానీ తెలంగాణలో అమలు చేస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. జీవో-317 మూలంగా వేలాదిమంది ఉపాధ్యాయులు స్థానిక ప్రాంతాలకు దూరంగా బదిలీ అయ్యారు. ఈ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కొంతమేర కృషి చేసినా ఇంకా పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారానికి నోచుకోలేదని టీచర్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. 2023 జులై నుంచి అమలుకావాల్సిన పీఆర్‌సీ అతిగతిలేదని టీచర్లు వాపోతున్నారు. తుదకు పీఆర్‌సీ కమిటీ వేతన సవరణ నివేదిక కూడా ఇవ్వని దుస్థితి నెలకొందని, రిటైర్ అయిన వారికి జీపీఎఫ్‌లు, ఏరియర్స్, బిల్స్ ఏళ్ల తరబడి చెల్లిచడంలేదని టీచర్లు అగ్రహవేశాలు వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 10నెలల కాలంలో వేలాదిమంది ఉద్యోగ విరమణలు చేశారని, మెడికల్, సరెండర్స్ అర్జిత సెలవుల పెండింగ్ బిల్స్ చెల్లింపులకు అమలు చేసిన ఈ-కుబేర్ మూలంగా బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని వివరించారు. అదేవిధంగా కస్తూరిబా విద్యాలయాలతో పాటు వివిధ సామాజికవర్గాల గురుకుల్లాల్లో పనివేళలు మార్చాలని హెడ్డాఫ్ ఎకౌంట్ 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలని, కాంట్రాక్ట్ టీచర్లకు టైంస్కేల్ విధానం అమలుచేయాలని ఏకీకృత సర్వీసుల అమలు, ఖాళీగా వున్న మండల విద్యాధికారుల పోస్టుల భర్తీ లాంటి సమస్యలు ఉపాధ్యాయ ఓటర్లు ఎకరువు పెడుతున్నారు.

## జై హనుమాన్





హాజరైన భక్తులు



- ఖమ్మంలో హనుమాన్ చాలీసా పారాయణ రికార్డ్
- 3,500మందితో శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం
- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో రికార్డు స్థాయిలో హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఆదివారం స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం కన్నుల పండువగా సాగింది. సుమారు 3,500 మంది హనుమాన్ భక్తులు ఈ పారాయణంలో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వివిధ జిల్లాలకు చెందిన భక్త బృందాలు హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నాయి. రికార్డు స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. వండర్ బుక్ ఆఫ్ ఇండియ చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేంద్రగౌడ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ కో-ఆర్డినేటర్ వీవీఎల్ శర్మలు ఈ రికార్డులను కార్యక్రమ నిర్వాహకులు (మిగతా 6వ పేజీలో)

## సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్‌గా సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ



రుద్రంపూర్, (సింగరేణి)ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్‌గా నియమితులైన సూర్యనారాయణ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానకార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణను సింగరేణి ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తామన్నారు. సింగరేణిలో కొత్త సంస్కరణలను చేపట్టేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ఏడాది సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు కార్మికులు, ఉద్యోగులు సమిష్టి కృషి చేయాలన్నారు. గైర్హాజరు శాతాన్ని మరింత తగ్గించేలా కార్మికులు విధులకు హాజరుకావాలని కోరారు. సవాళ్లను అధిగమిస్తూ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని, ఇందుకోసం సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలకు కార్మికులు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన కార్మికులకు యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందిస్తుందని తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం కార్మికులంతా సమిష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## నీరులేక ఎండుతున్న మొక్కజొన్న

- భక్తరామదాసు లిఫ్టునుంచి నీరందించి పంటను కాపాడాలి
- ఖమ్మం-సూర్యాపేట హైవేపై తల్లంపాడు వద్ద రైతుల ధర్నా

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు భక్తరామదాసు లిఫ్టునుంచి ఎస్ఆర్‌ఎస్‌పీ కాలువలకు నీరు అందించి ఆదుకోవాలని మొక్కజొన్న రైతులు ధర్నా చేశారు. ఖమ్మం జిల్లా రూరల్ మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలో ఆదివారం ఖమ్మం-సూర్యాపేట జాతీయరహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రూరల్ మండల పరిధిలోని తల్లంపాడు, గోపాలరావుపేట, మునిగేపల్లి తదితర గ్రామాల్లో సుమారు రెండు వందల ఎకరాలకు పైగా రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారని తెలిపారు. ప్రతిఏడాది పాలేరు రిజర్వాయర్ వద్ద ఉన్న భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా ఎస్ఆర్‌ఎస్‌పీ కాలువలకు నీరు అందించేవారని, ఆ నీటితో పాటు రైతుల భూముల్లోని బావులు, బోర్లపై ఆధారపడి రైతులు మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు సాగుచేసేవారన్నారు. అయితే ఈ ఏడాది అధికారులు ఎస్ఆర్‌ఎస్‌పీ కాలువలకు భక్తరామదాసు నీరు అందించకపోవడంతో మొక్కజొన్న పంట నిలువునా ఎండిపోతున్నాయని తెలిపారు.

రైతుల ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఐబీ అధికారులతో మాట్లాడించారు. త్వరలో నీరు అందిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో రైతులు సంకబుడ్డి లింగయ్య, రెంటాల నాగేశ్వరరావు, బ్రహ్మం, కోటయ్య, నవీన్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక దందాకు అడ్డుకట్ట



- ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం చర్యలు
- ఇసుక రీచ్‌లవద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- నిఘా పెంచిన రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణాశాఖలు

వివరాలు : 6లో



- ప్రత్యామ్నాయ పంటలవైపు రైతుల చూపు
- భద్రాద్రి జిల్లాలో పెరుగుతున్న పొగాకు సాగు
- ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు

## మిర్చి సాగుకు 'పొగ'

వివరాలు : 6లో



ల్యాప్‌టాప్‌లను పరిశీలిస్తున్న డీఎంవో నాగరాజశేఖర్

## పాఠశాలల్లో ఏఐ టీచింగ్

- విద్యా ప్రమాణాల పెంపునకు డిజిటల్ ఆధారిత బోధన
- ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగానికి సర్కార్ నిర్ణయం
- పైలెట్ ప్రాజెక్టులో భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు స్థానం

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించడం ద్వారా రాష్ట్రంలో పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో పాఠశాల విద్యను మరింత నాణ్యత ప్రమాణాలతో అందించేందుకు ఏఐ, డిజిటల్ ఇనిషియేటివ్స్‌లను విద్యరంగంలో పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. పాఠశాల విద్యలో విద్యా ప్రమాణాల పెంపునకు కృత్రిమ మేధ(ఏ.ఐ)ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)

# దుర్భేద్యంగా కరకట్ట..

- భద్రాచలంలో పనుల పునఃప్రారంభానికి రంగం సిద్ధం
- మార్చి రెండో వారం నుంచి శాశ్వత రక్షణ పనులు
- పునాది నిర్మాణానికి శాస్త్రీయ పరీక్ష నిర్వహణ


ఎలివేటర్ రోడ్డు నిర్మించే ప్రాంతం ఇదే


తుది దశలో స్లూయిస్ నిర్మాణం

భద్రాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శివారులో చేపడుతున్న మిగులు కరకట్ట పనులు వివిధ కారణాలతో సుమారు ఐదు నెలలుగా నిలిచిపోయాయి. మార్చి రెండో వారం నుంచి పనులు పునఃప్రారంభించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో కీలకమైన కరకట్టను అనుసంధానిస్తూ ఎలివేటర్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన పునాది పరీక్షను భూగర్భ శాస్త్రవేత్తల సూచన మేరకు నిర్వహించారు. ఇటీవల నీటిపారుదల శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) విభాగానికి నివేదికను అధికారులు పంపారు. ఎలివేటర్ రోడ్డు నిర్మించే ప్రాంతంలో ఐదు నుంచి ఆరు మీటర్ల లోతులో పునాది వేయాలని నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే పునాది నిర్మాణ పనులు డ్రాయింగ్ వర్కు పూర్తయింది. ఈ నెలాఖరు వరకు సీడీవో నుంచి అనుమతులు రానున్నట్లు సమాచారం. అనంతరం జాతీయ రహదారుల శాఖ నుంచి తుది అనుమతులు తీసుకొని రోడ్డు నిర్మాణ పనులు మార్చి రెండో వారంలో ప్రారంభించనున్నట్లు నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పునాది నిర్మాణం, కరకట్ట విస్తర్ణకు సుదీర్ఘ సమయం కావాల్సి ఉండటంతో పట్టణంలోకి వరద నీరు రాకుండా తూము నిర్మిస్తుండగా అది తుది దశకు చేరుకుంది. దీనికి త్వరలో షట్టర్లను బిగిస్తే వరద ముప్పు చాలా వరకు తగ్గుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**రూ.40 కోట్ల అదనపు నిధులతో పనులు**

తొలుత నీటిపారుదల శాఖ అధికారులు 3.4 కి.మీ. కరకట్ట నిర్మాణం కోసం 33 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇందులో 700 మీటర్ల కరకట్ట నిర్మాణం గతంలో చేపట్టాల్సి ఉండగా ఆగిపోయింది. దీంతో నూతనంగా చేపట్టాల్సిన 700 మీటర్ల కరకట్టకు రూ.38 కోట్లతో పనులను చేపట్టారు. జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి 2024 జూన్ నెలలో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన క్రమంలో పలు మార్పులను స్థానిక అధికారులకు సూచించారు. గత డిజైన్‌లో మార్పులు చేస్తూ ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం(ఫ్లై ఓవర్ మాదిరిగా) చేపట్టనున్నారు. ఇటీవల జాతీయ రహదారిలో ఏమైనా మార్పులు చేపడితే నూతన డిజైన్ల ఆధారంగా పనులు చేపట్టాల్సి ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో వారు సూచించిన విధంగా పనులు చేపడుతున్నారు. ఇందుకోసం సుమారు రెండున్నర ఎకరాల స్థలాన్ని సైతం అదనంగా సేకరించి అలాగే మరో రూ.40 కోట్లతో అదనపు అంచనాలను రూపొందించి పంపినట్లు తెలుస్తోంది. పాత కరకట్ట బేస్ 53 మీటర్లు ఉండగా కొత్తగా నిర్మిస్తున్నది 65 మీటర్ల వరకు ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కట్ట ఎత్తు గతంలో 12.50 మీటర్లుండగా ఇప్పుడు 13 మీటర్లు ఎత్తు ఉండనుంది. భద్రాచలం వద్ద గోదావరి వరద అత్యధికంగా ఇప్పటి వరకు 1986 ఆగస్టులో వచ్చిన 75.6 అడుగులే. దానిని మించి 80 అడుగులు వచ్చినా ఎటువంటి ముంపు లేకుండా కరకట్ట నిర్మాణం చేపడుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**శాశ్వత రక్షణే ధ్యేయంగా....**

గోదావరి వరదల సమయంలో భద్రాచలం వద్ద 80 అడుగుల వరద నీరు వచ్చినా భద్రాచలంలోని శాంతినగర్, కూనవరం రోడ్డు,సుభాష్‌నగర్ కాలనీల వైపు వరద నీరు రాకుండా ఉండేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఇప్పటికే పలుమార్లు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. భవిష్యత్తులో పోలవరం బ్యాక్ వాటర్ సమస్య వచ్చినా ఈ ప్రాంతం వారికి ముంపు ప్రమాదం లేకుండా చూడాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం నిర్మిస్తున్న మిగులు కరకట్ట డిజైన్‌లో తాజాగా ఎలివేటెడ్ రోడ్డును అదనంగా చేర్చారు. దీంతో విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో భద్రాచలం శివారు ప్రాంతంలో డిజైన్ మార్పులు చోటు చేసుకున్నాయి. జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారుల సూచన మేరకు నీటిపారుదల శాఖ అధికారులు అందుకు అనుగుణంగా మార్పులు చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనుల డిజైన్‌లో మార్పులను చేస్తూ ఇందుకు అవసరమైన భూ సేకరణకు ఇప్పటికే ఎంత స్థలాన్ని సేకరించాలి అనే దానిపై నిర్ధారణకు వచ్చి అందుకు అదనంగా తీసుకుంటున్న స్థలంతో కరకట్ట నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది.


ఆస్పత్రి, రెవెన్యూ అధికారులకు తమ వద్ద ఆధారాలు చూపుతున్న వ్యక్తి

# జిల్లా ఆస్పత్రి స్థలం మాదే !

- మిగులు స్థలాన్ని మాకు కేటాయించాలి
- కోర్టు ఆదేశాలతో కొందరు వ్యక్తులు స్థల ఆక్రమణకు సిద్ధం
- పాత ధర్నాచౌక్ వద్ద అధికారులతో వాగ్వాదం
- పరిశీలించాలంటూ ఆర్డీవోకు ఉన్నతాధికారుల ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా ఆస్పత్రి స్థలం మాదే.. మా వంశీకులు అప్పట్లో ఆస్పత్రికి 24 ఎకరాల భూమిని కేవలం రూ.1లక్షా10వేలకు ప్రభుత్వానికి ఇచ్చారు.. ఆస్పత్రి అవసరాలు పోను మిగులు భూమి ఉంది. ఇప్పటి వరకు ధర్నా చౌక్ నిర్వహించారు.. ఈ స్థలాన్ని మాకు కోర్టు కేటాయించింది..' అంటూ ఓ కుటుంబం పక్షం రోజులుగా ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తోంది. శనివారం, ఆదివారం ఆ స్థలంలో ఆ కుటుంబ సభ్యులకు, రెవెన్యూ , ఆస్పత్రి అధికారులకు మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఉన్నతాధికారులు కల్పించుకుని దీని సంగతేంటో చూడాలంటూ ఖమ్మం ఆర్డీవోను ఆదేశించారు.

**1963లో భూసేకరణ..**

1963లో ఏప్రిల్ 11న జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఖానాపురం హవేలీలో సర్వేనెంబరు 253/2, 262, 263/6 3.33 ఎకరాలు, 4.03 ఎకరాలు, 5 ఎకరాలు, 6.06 మొత్తం 24 ఎకరాలు ఆస్పత్రికి కేటాయించినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీనికి గాను చదరపు గజానికి రూ.2చొప్పున 1లక్ష 00,924, చెట్ల డ్యామేజీకి 240, బావికి రూ.3వేలు, ఇతర ఖర్చులు మొత్తం రూ.1లక్ష 10వేలు నిర్వాసితులకు అందజేసినట్లు , అగ్రిమెంట్ చేసినట్లు ధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్నారు.

**అధికారులకు నోటీసులు**

వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాల ఆధారంగా నిర్వాసితుల వారసులుగా చెబుతున్న హబీబున్నీసా బేగం, ఆమె భర్త యాసిన్‌ఖాన్ ఖమ్మం రెవెన్యూ అధికారులకు నోటీసులను గత డిసెంబరు 12న అందించారు. దీని ఆధారంగా సర్వే నిర్వహించి మిగులు భూమిని( పాత ధర్నా చౌక్, చాకలి ఐలమ్మ విగ్రహం ఉన్న స్థలాన్ని) 10కుంటల స్థలాన్ని తమకు కేటాయించాలంటూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలు తమకు ఉన్నాయంటూ ఆ వ్యక్తులు గత నెల 27వ తేదీన ఆ స్థలానికి హద్దులు పాతేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఆస్పత్రి అధికారులు ఆ ప్రయత్నాన్ని నిలువరించారు. శనివారం, ఆదివారం సదరు కుటుంబీకులు తిరిగి ఆస్థలాన్ని ఆక్రమించుకునేందుకు బలగంతో వచ్చారు. దీంతో ఇక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆధారాలు చూపించాలని, ఆర్డీవో కార్యాలయానికి వచ్చి చూపిస్తే విచారణ నిర్వహిస్తామని చెప్పడంతో వెళ్లారు.



జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బ్యానర్లు

**ఆస్పత్రి అధికారులు ఏమంటున్నారంటే..**

జిల్లా మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న జిల్లా జనరల్ ఆస్పత్రికి పాత కలెక్టరేట్ స్థలం 5.23 ఎకరాలు, ప్రభుత్వ ఆస్పత్రి స్థలం 21.31 ఎకరాలు, ఆర్‌అండ్‌బీ స్థలం 3.09 ఎకరాలను మెడికల్ కళాశాలకు దారాదత్తం చేస్తూ జూలై 29, 2022న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఈ మేరకు ఈ స్థలం తమదే అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిశోర్ కుమార్ చెబుతున్నారు. తాత్కాలికంగా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడంతో పాటు ధర్నాచౌక్‌కు స్థలాన్ని కేటాయించారని అన్నారు. అక్కడే మరుగుదొడ్ల నిర్మాణానికి ఆస్పత్రి స్థలాన్ని వినియోగించారని, 70 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఆధీనంలోనే సదరు స్థలం ఉందంటూ ఖమ్మం అర్బన్ తహసీల్దారు తేల్చి చెప్పడంతో కోర్టుకు నివేదించారు. దీనిని ఆ కుటుంబీకులు చాలెంజ్ చేస్తూ ఆర్డీవో కోర్టుకు వెళ్లినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారులు విఫలమవుతున్నట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## వైభవంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారికి ఆదివారం నిర్వహించిన నిత్య కల్యాణంలో 125 జంటలు పాల్గొన్నాయి. అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా నిర్వహించే ప్రత్యేక అభిషేకంలో 43 స్వర్ణ పుష్పార్చనలో 112 మంది పాల్గొన్నారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రామయ్య దర్శనానికి తరలివచ్చారు.


స్వామి వారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు


ప్రథమ బహుమతి సాధించిన నేలకొండపల్లి జట్టు

## రాజీవ్ ట్రోఫీ విజేత నేలకొండపల్లి

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో వారం రోజులుగా జరుగుతున్న రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. టోర్నీ విజేతగా నేలకొండపల్లి జట్టు నిలవగా రన్నరప్‌గా ఖమ్మం అర్బన్ జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఖమ్మం అర్బన్ జట్టుపై నేలకొండపల్లి జట్టు విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం అర్బన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన నేలకొండపల్లి జట్టు 19.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలకు సినీ నటి స్వప్న చౌద రి బహుమతులు ప్రదానం చేశారు.

# అలరించిన కబడ్డీ పోటీలు

- ముగిసిన అంతర్ జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు
- బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం
- ట్రోఫీ అందజేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్


భద్రాద్రి జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌కు హాజరైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సమానమన్నారు. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి 960 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడం జిల్లా జట్టు తొలి స్థానంలో నిలువగా రంగారెడ్డి జిల్లా రన్నరప్‌గా నిలిచింది. కాగా వారికి స్పీకర్ ట్రోఫీ అందజేశారు. బాలుర విభాగంలో నల్గొండ జట్టు విజేతగా నిలవగా నాగర్ కర్నూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. క్రికెట్ వలంటీర్స్ టీం సహకారంతో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వినోద్ ముదిరాజ్ తెలిపారు. ఈ వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జిల్లా కబడ్డీ అధ్యక్షుడు పరుశురాంనాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాలే లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

# ముగిసిన కోలిండియా అథ్లెటిక్స్ పోటీలు

(5వ పేజీ తరువాయి)

రాజేంద్రప్రసాద్, రాజీవ్‌కుమార్, రాజశేఖర్ అధికారులు రాజ్‌గోపాల్, సత్యనారాయణ, సుశీల్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కోల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలో ఓవరల్ చాంపియన్ షిప్‌గా నిలిచిన ఎంసీఎల్ (మహానంది కోల్ లిమిటెడ్)కు మొత్తం 213 పాయింట్లు లభించాయి. ఈ సంస్థ క్రీడాకారులు 23 బంగారు పతకాలు సాధించగా 9 సిల్వర్ పతకాలు, ఒక బ్రాంజ్ పథకం సాధించారు. మొత్తం ఈ పోటీల్లో 9 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్‌సీసీఎల్ (సింగరేణి) సంస్థ 109 పాయింట్లతో ఐదు బంగారు పతకాలు, పది వెండి పతకాలు, మూడు క్యాంస పతకాలతో ఐదో స్థానంలో నిలిచింది.


మహిళల పరుగు పందెం పోటీ

**ఓటమితో కుంగిపోవద్దు**

**ఎల్‌వీ.సూర్యనారాయణ, డైరెక్టర్(ఆపరేషన్)**

సింగరేణి క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని డైరెక్టర్(ఆపరేషన్) ఎల్‌వీ.సూర్యనారాయణ తెలిపారు. క్రీడాకారులు ఓటమితో కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఆదివారం రాత్రి జరిగిన కోల్‌ఇండియా అథ్లెటిక్స్ పోటీల ముగింపు కార్యక్రమం ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం మాట్లాడారు. జీఎం (పర్సనల్) వెల్ఫేర్ కవితానాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రటరి మిరియాల రంగయ్య, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) సీనియర్ జనరల్ సెక్రటరి ఎస్.నరసింహారెడ్డి, సింగరేణి సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ పి.రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

## జై హనుమాన్

(5వ పేజీ తరువాయి)

మేములపల్లి వెంకటేశ్వరరావు, గన్నవరపు నాగేశ్వరరావులకు అందించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్లు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని కాపాడే దిశలో రామభక్త హనుమాన్ చాలీసాను ఒకే కంఠంతో పలకడం విశేషమన్నారు. కార్యక్రమంలో 10అడుగు హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీ ఆర్ఎస్ నేత గుండాల కృష్ణ పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి సభ్యులు లగడపాటి రామారావు, ప్రతాపనేని నరసింహారావు, కురువెళ్ల జగన్‌మోహన్‌రావు, అరవపల్లి నిరంజన్, తెలంగాణ కో-ఆర్డినేటర్లు ఇసనపల్లి నగేష్, నాగసాయి. నవీన్ వీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భక్తి పారవశ్యంతో నృత్యం చేస్తున్న భక్తులు

# మిర్చి సాగుకు 'పొగ'

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మార్కెట్ జూదంగా మారిన మిర్చి సాగుకు ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. భద్రాద్రి జిల్లా ఈ ఏడాది పొగాకు సాగు వైపు కొంత మొగ్గు చూపారు. దుమ్ముగూడెం మండలంలో ఇరవై ఐదేళ్ల తర్వాత మరోమారు రైతులు పొగాకు సాగును చేపట్టారు. ఈ ప్రాంత రైతులు చివరిగా 2000 సంవత్సరంలో పొగాకు వేసి మానేయగా ఇన్నేళ్లకు మళ్లీ తమ అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. నరసాపురం, సీతారాంపురం, గంగోలు, మారేడుబాక ప్రాంతాల్లో ఈ ఏడాది పొగ సాగు చేపట్టారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల రైతులు ఈ ఏడాది యాభై ఎకరాలకు పైగా పొగాకు సాగుచేశారు. గత నాలుగైదేళ్లుగా మిర్చి సాగు అంతగా కలిసి రాకపోవడం, పంట ఆరంభంలోనే నల్లి, ముడత వంటి తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మిర్చి పంటకు ప్రత్యామ్నాయంగా పొగాకును ఎంపిక చేసుకున్నారు. పొగాకు సాగుపై రైతులు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

**రూ.18వేలకు కొనుగోలు ఒప్పందం**

రాజమండ్రికు చెందిన ఓ ప్రైవేటు పొగాకు కంపెనీ ఒప్పందంపై దుమ్ముగూడెం రైతులు సాగు చేపట్టారు. క్వింటాకు సుమారు రూ.18వేల ధర ఇస్తామని తెలపడంతో కొందరు రైతులు ఆసక్తి చూపారు. ఎకరానికి పెట్టుబడి రూ.1లక్ష వరకు ఖర్చు కానుండగా, పది నుంచి పద్నాలుగు క్వింటాళ్ల దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. నాలుగు నెలల వ్యవధిలో పంట చేతికి రానుంది. కాగా గతంతో బ్యారన్ పొయ్యిలో పొగాకు కాల్చే విధానం ఉండగా, ప్రస్తుత పొగాకు పంటను ఆరుబయట ఎండ పెట్టాల్సి ఉంటుంది. అయితే కర్నాటక ప్రాంతంలో ఇదే రకం పొగాకు క్వింటాకు రూ.30వేల వరకు ధర పలుకుతున్నట్లు తెలుస్తుండగా ప్రస్తుతం తమకు ప్రకటించిన రేటు బాగా తక్కువగా ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. సాగుకు ముందు క్వింటాకు రూ.18వేలు ఇస్తామన్న కంపెనీ ప్రతినిధులు ప్రస్తుతం రైతుకో రేటు చెబుతున్నారని వాపోతున్నారు.

**సాగు కష్టతరంగా ఉంది**

పొగాకు సాగు కష్టతరంగా ఉందని బుర్రవేముల రైతు బొప్పన శ్రీను తెలిపారు. తాను ఆరెకరాల పొగాకు పంట వేయగా ప్రస్తుతం ఆకు కోత, ఎండబెట్టడానికి అనేక రకాల ఇబ్బందులెదుర్కొంటున్నామన్నారు. మరోవైపు మిర్చిసాగు చేస్తున్న తనలాంటి రైతులకు పొగాకు సాగు కష్టంగా మారిందన్నారు. ప్రత్యేకంగా పొగాకు సాగు మీద ఉన్న రైతుకు కొంత ప్రయోజనముండవచ్చని, రెండో పంట వేసిన రైతులకు ఇబ్బందులేనన్నారు. అలాగే పెట్టుబడి కూడా అనుకున్న దానికంటే ఎక్కువైందన్నారు.

# ఇసుక దందాకు అడ్డుకట్ట

- ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం చర్యలు

ఖమ్మం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతిప్రతినిధి): గోదావరి సాక్షిగా జిల్లాలో జరుగుతున్న ఇసుక మాఫియాను అరికట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఆదేశించడంతో గత కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లా అధికారులు ఇసుకాసురులపై కొరడా ఝుళిపిస్తున్నారు. మరోవైపు టీఎస్ఎండీసీ, మైనింగ్, పోలీసు, రవణశాఖ అధికారులు కూడా నిఘా చర్యలు ముమ్మరం చేశారు. జిల్లాలో గోదావరి నదితో పాటు కిన్నెరసాని, మున్నేరు, కట్టలేరు తదితర చోట్ల ఇసుక అక్రమరవాణా జరుగుతోంది. ఇసుక దళారులే టీఎస్ఎండీసీ వెబ్‌సైట్ నుంచి పలు పేర్లతో బుక్‌చేసుకుని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారంలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ ముఖ్యనేతలు అండగా ఉండడంతో గత కొన్నినెలలుగా ఇసుక దందా జోరుగా సాగుతోంది.

**ప్రభుత్వం మారినా అదే తీరు..**

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ఇసుక మాఫియా తన దందా కొనసాగిస్తూనే ఉంది. ఇసుక అక్రమ వ్యాపారులు కొందరు రాష్ట్రస్థాయి నేతలుతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులతో సంబంధాలను ఏర్పాటుచేసుకుని భారీగా ముడుపులు చెల్లించి మళ్లీ ఇసుక రవాణాను గత నాలుగునెలలుగా నడిపిస్తున్నారు. గోదావరి నుంచి వందల సంఖ్యలో లారీలు, ఖమ్మం, హైదరాబాదు వైపు వెళుతున్నాయి. చర్ల, మణుగూరు కేంద్రాల్లో ఇసుక మాఫియా పాగావేసి గోదావరి సాక్షిగా ఇసుక రవాణా చేస్తోంది. ప్రతి లారీలో ఓవర్ లోడ్ వేసుకొని రవాణా చేస్తున్నారు. కొత్తగా గోదావరి పరివాహకంలో 18చోట్ల ఇసుక క్వారీలు ఏర్పాటుకు ఇసుక తవ్వకాలకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందుకు రాష్ట్రస్థాయి ప్రతినిధుల సహకారంతో ఒక్కో ఇసుక క్వారికి ఒక్కో ఇన్‌చార్జిని ఏర్పాటు చేశారు. గతంలో ఏపీలో వైఎస్ జగన్ హయాంలో సాగిన తరహాలో ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి ఇసుక తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోదావరి పరివాహకంలో జరుగుతున్న ఇసుక మాఫియాపై చర్యలకు పూనుకున్నారు. దీంతో 18 కొత్త ఇసుక క్వారీలకు అనుమతులు నిలిపివేశారు. ప్రస్తుతం నడుస్తున్న చర్లలోని 3 క్వారీలకు సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు టీఎస్ఎండీసీ, రెవెన్యూ, పోలీసు, రవాణాశాఖ సిబ్బందిని బృందంగా ఏర్పాటుచేసి ఇసుక రీచ్‌లవద్ద నిఘా ఏర్పాటు చేశారు.

**ముఖ్యమంత్రి స్పందిస్తేనే కదలిక..**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అధికారయంత్రాంగం ఇంతకాలం ఇసుక మాఫీయాపై ఉదాసీనంగా వ్యవహరించింది. వేబిల్లులు లేకుండా ఓవర్ లోడ్‌తో ఇసుకరవాణా జరుగుతున్నా చెక్‌పోస్టుల్లో కానీ పోలీసు, రెవెన్యూ, మైనింగ్, రవాణ శాఖ అధికారులు కేసులు పెట్టలేకపోయారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఇసుక మాఫియాపై దృష్టి పెట్టకపోవడంతో యథేచ్ఛగా ఇసుకరవానా సాగింది. ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుండడంతో విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లింది. దాంతో సీఎం రేవంత్‌రెడ్డి గోదావరి పరివాహకంలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలకు ఆదేశించడంతో ప్రస్తుతానికి బ్రేక్‌పడింది.

**తెరవెనుక ప్రయత్నాలు**

ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాకు తాత్కాలికంగా చెక్ పడినా ఇసుక మాఫియా మళ్లీ తన దందాను కొనసాగించేందుకు తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత కొన్నిరోజులుగా హైదరాబాదులో మకాం వేసి అధికారపార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులను కలిసి తమ వ్యాపారం కొనసాగించేందుకు సహకరించాలని, అవసరమైతే వ్యాపారంలో షేర్‌లు ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ అండతో ఇసుక మాఫియా సాగించిన అప్పటి కాంట్రాక్టర్లే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతూ గోదావరి ఇసుకతో వ్యాపారం చేసేందుకు భారీగా పైరవీలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఇసుక అక్రమరవాణపై ముఖ్యమంత్రిస్థాయిలో చర్యలు తీసుకున్నందున ఇతరులెవ్వరూ వేలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర భూగర్భగనుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ కూడా ఇటీవల గోదావరి పరివాహకంలో అక్రమ ఇసుక వ్యాపారంపై సమీక్ష నిర్వహించి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో రోజులో కొన్నిగంటలపాటు మాత్రమే ఉండే టీఎస్ఎండీసీ బుకింగ్ పద్ధతిని 24గంటలు ఉండేలా మార్పులు చేశారు. జిల్లాస్థాయిలో గోదావరి ఇసుక రీచ్‌లవద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణాశాఖ అధికారుల గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించడంతో ప్రస్తుతం ఆయా ప్రభుత్వ శాఖలు అప్రమత్తమయ్యాయి. అయితే ఈ కట్టుదిట్టమైన చర్యలు ఎంతవరకు అమలులో ఉంటాయోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు కూడా వత్తిళ్లకు లొంగితే గోదావరి ఇసుక దందా పునఃప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# పాఠశాలల్లో ఏఐ టీచింగ్

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితారాణా నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మేడ్చల్, వికారాబాద్, నారాయణపేట, మెదక్ జిల్లాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికచేశారు. ఒక్కో జిల్లాలో ఇంటర్‌నెట్, కంప్యూటరు విద్య, ఆన్‌లైన్ సదుపాయాలు కలిగిన ఆరు పాఠశాలలను గుర్తించారు. విద్యరంగంలో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులలో విద్యాపరమైన నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంలో డిజిటల్ టీచింగ్ దోహదపడనుంది. ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ సంస్థ (ఎక్‌స్టెప్-ఫౌండేషన్) భాగస్వామ్యంతో ఏర్పాటైన ఏ.ఐ ఫౌండేషన్ అకాడమీ 'అడ్వాంటేజ్ తెలంగాణ' కార్యక్రమం ద్వారా ఈ ఏఐ ఆధారిత విద్యను ప్రవేశపెట్టేందుకు సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసింది.

**భద్రాద్రి జిల్లాలో పాఠశాలలు ఇవే..**

బూర్గంపాడు మండలంలోని అంజనాపురం, మోరంపల్లిబంజర, నాగినేనిప్రోలు, బూర్గంపాడు-2, గాంధీనగర్, భద్రాచలం మండలంలోని తాతగుడి సెంటర్‌తోకలిపి జిల్లాలో మొత్తం ఆరు మండలపరిషత్ పాఠశాలలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటుచేశారు. ఈ పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులకు చెందిన 350మంది విద్యార్థులకు బోధించేందుకు శనివారం పాఠశాల హెచ్‌ఎంలకు శిక్షణ కల్పించారు.

## పెళ్లి ఫంక్షన్‌లో నో ప్లాస్టిక్

ఆదర్శంగా నిలిచిన పంచాయతీ కార్యదర్శి



భోజనానికి అరటి ఆకులు, మట్టి గ్లాసులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతగా ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి తన వివాహ కార్యక్రమాన్ని వినూత్న రీతిలో ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాడు. ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లి మారెమ్మ దేవాలయం సమీపంలోని అమ్మ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంటాయపాలెం గ్రామానికి చెందిన వీదగాని సంపత్ వివాహం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామానికి చెందిన నవ్యతో జరిగింది. సంపత్ డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. అయితే తమ వివాహ కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడకూడదనేది నిర్ణయించుకున్న సంపత్ తన పెళ్లికి స్వాగతం బోర్డు ప్లాస్టిక్ ఫ్లెక్సీతో కాకుండా వస్త్రంపై రాయించాడు. పెళ్లి విందుతో ప్లాస్టిక్ విస్తర్ల స్థానంలో అరటి ఆకులు, మట్టి గ్లాసులు ఏర్పాటు చేశాడు. మండపంలో అరటి ఆకులు, పూలతో డెకరేషన్ చేయించాడు. వివాహానికి వచ్చిన అతిథులు కూర్చునేందుకు అల్యూమినియం కుర్చీలను ఏర్పాటు చేశాడు. ఇలా పెళ్లి తంతులో ఎక్కడా ప్లాస్టిక్ లేకుండా ఏర్పాట్లు చేయడంతో పెళ్లికి వచ్చిన అతిథులు ఆశ్చర్యపోయారు. ప్లాస్టిక్ రహితంగా పెళ్లి చేసుకుని పలువురికి ఆదర్శంగా నిలవాలనే తపనతోనే ఇలా ఏర్పాట్లు చేసినట్లు సంపత్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.

### తీర్థాల జాతరకు ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం డిపో నుంచి ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ సంగమేశ్వర స్వామి తీర్థాల జాతరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ బస్సులు ఖమ్మం పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, కాల్వొడ్డు ప్రాంతాల నుంచి కామంచికల్ మీదుగా ఆలయం వరకు భక్తులను తీసుకెళ్లటం జరుగుతుందని తెలిపారు.

## స్వయం భూగా పోతురాజు స్వామి

ఏటేట పెరుగుతూ వచ్చిన ఆలయం

సహజసిద్ధంగా ఏర్పడిన పుట్టలు, నీటి గుంత

శివరాత్రికి ఒక్కరోజు జాతర



పోతురాజు స్వామి ఆలయం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఎన్నో వింతలు.. ఎన్నో అద్భుత దృశ్యాలు. ఎన్నో విశేషాలు. అలాంటిదే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, తిరుమలకుంట కాలనీ సమీపంలో స్వయం భూగ వెలిసిన పోతురాజు స్వామి ఆలయం. సాధారణంగా కొండ పై భాగాన ఆలయాలు ఉంటాయి. కాని ఇక్కడ పోతురాజు స్వామిగా పిలువబడే ఈ ఆలయం కొండ మధ్యభాగంలో ఏర్పడి ఉంటుంది. ఈ ఆలయానికి కింద, పైనా కొండ ఉంటుంది. ఆలయంలో స్వయం భూగా వెలిసిన పోతురాజు విగ్రహం ఏటేటా పెరుగుతూ వచ్చిందని పెద్దలు చెపుతూ వస్తుంటారు. శతాబ్దం క్రితం ఈ ఆలయంలోకి వెళ్లాలంటే మనిషి ఒంగొని దూరి వెళ్లాల్సి వచ్చేదని, ప్రతి ఏటా ఆలయం ఎత్తు పెరుగుతూ వచ్చిందని, తదనుగుణంగా విగ్రహం కూడ పెరుగుతూ వచ్చిందని చెపుతుంటారు. అయితే కొందరు దుండగులు పోతురాజు స్వామి విగ్రహాన్ని తవ్వి తరలించుకునే ప్రయత్నంలో విగ్రహం మధ్యలో బీటలు వారింది. ఈ ఘాతుకానికి పాల్పడిన నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే రక్తం కక్కుంటూ చనిపోయారని, ఆ నాటి నుంచి విగ్రహం పెరగటం నిలచిపోయిందని ఈ ప్రాంతంలోని గిరిజనులు చెపుతుంటారు. ఈ ఆలయంలో ఓ పక్కన ప్రత్యేకంగా గదిలా ఏర్పడి ఆ గదంతా పుట్టలు ఏర్పడ్డాయి. ఓ మూల సహజసిద్ధంగానే నీటి గుంత ఏర్పడింది. నిండు వేసవిలోను ఈ గుంతలో మంచినీరు ఉంటుంది. గుహలా ఉండే ఈ ఆలయంలోపల భాగంలో ఎక్కడ పడితే అక్కడ చిన్న చిన్న బొరియలు ఉంటాయి. పూర్వం ఈ బొరియలలో వివిధ రకాల జంతువులు, పక్షులు నివాసముండేవని చెపుతుంటారు. ఇక్కడ ఉన్న పుట్టలలో అరుదైన అనేక రకాలైన సర్పాలు ఉంటాయి. రోజు తెల్ల వారుఝామున, సూర్యోదయం సమయాల్లో, రాత్రుళ్ళు అరుదైన దేవతా సర్పాలు సంచరిస్తుంటాయని, పోతురాజు విగ్రహాన్ని చుట్టుకొని ఇప్పటికి ఉంటాయని, చాలా మందికి కనిపించాయని భక్తులు చెపుతుంటారు. అందుకే కొండపైనున్న ఈ ఆలయానికి భక్తులు సూర్యోదయ సమయంలో అటువైపుకు వెళ్లరు. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ ఆలయంలోని పుట్టలలోనే సుబ్రహ్మణ్య షష్ఠి, నాగుల చవితి, కార్తీక మాసంలో పాలు పోసి పూజలు చేసేందుకు సుదూర ప్రాంతం నుంచి భక్తులు వస్తుంటారు. ఇక్కడ మొక్కుకుంటే సంతానం కలుగుతారని నమ్మకం. సంతానం కలిగిన తరువాత కూడ చంటి బిడ్డలతో సహా వచ్చి పుట్టలపై బిడ్డను ఉంచి బూరెలు పోస్తారు. వర్షాలు రాక కరువుతో సతమతయ్యే సమయంలో ఇక్కడి గిరిజనులు డప్పులతో జాతరగ వెళ్లి స్వామివారిని కొలిస్తే భక్తులు తిరిగి ఇంటికొచ్చేటప్పుడు వర్షంలో తడుస్తూ వస్తారని, అంతటి మహిమగల స్వామి పోతురాజు స్వామి అని ఇక్కడ గిరిజనులు చెపుతుంటారు. శివునికి ప్రతిరూపంగ పోతురాజు స్వామిని భావించే ఈ ప్రాంత గిరిజనులు శివరాత్రికి ఒక్కరోజు జాతర నిర్వహించి అన్నదానం నిర్వహిస్తారు. ప్రకృతి అందాలు, కొండ మధ్య బాగంలో స్వయంభూగ వెలిసిన ఈ ఆలయం భక్తితో పాటు ఎన్నో ప్రకృతి దృశ్యాలకు నిలయమై ఉంది.



పోతురాజు స్వామి



ఆలయంలోని పుట్ట



సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి గుంత

## క్రైం సమాచారం

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కూసుమంచి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని తుర్కగూడెం గ్రామంలో బుర్ర దర్గయ్య(28)అనే రైతు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకునాడుఉ. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు చేసిన దర్గయ్య వాటిని తీర్చలేక ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య బాలింత కావడంతో నర్సింహులగూడెం గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లింది. ఈ సమయంలోనే దర్గయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

మధిరటౌన్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మధిర ఎక్సైజ్ పోలీసులు శనివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ లో చేపట్టిన తనిఖీలలో గుర్తు తెలియని వ్యక్తులు ఉంచిన బ్యాగుల్లో ఉన్న గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించగా అనుమానస్పదంగా కనిపించిన రెండు బ్యాగులను తనిఖీ చేయగా అందులో ఎండు గంజాయిని గుర్తించటం జరిగిందని, ఎవరో గుర్తు తెలియన వ్యక్తులు బ్యాగులను రైల్లో ఉంచారని తెలిపారు. బ్యాగుల్లో ఉన్న గంజాయిని తూకం వేయగా 8 కేజీలు లభ్యమైందని తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్‌ఐ జనార్దన్ రెడ్డి, సిబ్బంది రియాజ్, ముస్తాఫా, రజాలి, నాగరాజు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం చోరీ

కొణిజర్ల, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాంతినగర్‌లో ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగుచూసింది. ఎస్‌ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం శాంతినగర్‌కు చెందిన కట్ల నిఖిల్ తన ఇంటి ముందు రోజువారిలాగానే ద్విచక్రవాహనాన్ని తాళం వేసుకొని ఉంచాడు. ఉదయం లేచి చూడగానే బైక్ కనిపించకపోవడంతో ఆందోళన చెందుతూ మొత్తం వెతికాడు. చివరకు ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కారేపల్లి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లి గ్రామంలో ఆదివారం ఎస్‌ఐ ఎన్.రాజారాం ఆధ్వర్యంలో సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. గ్రామంలో కొందరు పేకాటాడుతున్న సమాచారం అందకున్న ఎస్‌ఐ దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్.ఐ.రాజారాం తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కారేపల్లి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిద్దవారిగూడెం బస్టాండ్‌కు సమీపంలో ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో బానోత్ సోమ్లా అనే వ్యక్తి తీవ్రగాయలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామానికి చెందిన సోమ్లా కారేపల్లి క్రాస్‌రోడ్డులో మిర్చి బస్తాలు కొనుగోలు చేసేందకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ మోటర్ సైకిల్‌పై నుండి కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కి సమాచారం అందించి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

**నేలకొండపల్లిలో..**

నేలకొండపల్లి: నేలకొండపల్లి పాత పెట్రోలుబంకు సమీపంలో ద్విచక్రవాహనదారుడు డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల ప్రకారం నేలకొండపల్లికి చెందిన షేక్. సుభాన్ సూర్యాపేట జిల్లా కోదాడలో సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం కోదాడ నుంచి నేలకొండపల్లికి వస్తుండగా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో వేగంగా ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టాడు. డివైడర్‌ను ఢీకొట్టి కిందపడిపోయిన సుభాన్ తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ సుభాన్‌ను తొలుత నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం 108లో ఖమ్మం తరలించారు.

**దంపతులకు తీవ్రగాయాలు..**

ద్విచక్రవాహనం జారి కింద పడిన సంఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు, చిన్న పాప తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం నేలకొండపల్లి సమీపంలో ఆచార్లగూడెం క్రాస్‌రోడ్డు సమీపంలో జరిగింది. వివరాల ప్రకారం ఖమ్మంకు చెందిన వేణుకుమార్ తన భార్య సంధ్య, చిన్న పాపతో కలిసి ద్విచక్రవాహనంపై నేలకొండపల్లి వైపు వెళుతున్న క్రమంలో, నేలకొండపల్లి సమీపంలో ఆచార్లగూడెం క్రాస్‌రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనం స్కిడ్ అయ్యి కింద పడిపోయినట్లు తెలుస్తున్నది. దీంతో సంధ్య, వేణుకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. చిన్న పాపకు సైతం తీవ్రంగా గాయాలైనట్లుగా తెలుస్తున్నది. వారి పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లుగా సమాచారం. గాయపడిన వారిని ఖమ్మం తరలించారు.

**ప్రమాదంలో కార్మికుడి మృతి...**

మండల పరిధిలోని గువ్వలగూడెంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లుగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### ఆరుగురిపై కేసు నమోదు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామంలోని ఓ మామిడితోటలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. తిరుమలాయపాలెం సమీపంలోని స్మశానవాటిక సమీపంలోని మామిడితోటలో కోడిపందేలు ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు.

### చికిత్స పొందుతూ ఫార్మసిస్ట్ మృతి

ఖమ్మం క్రైం ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పురుగులమందు తాగి చికిత్స పొందుతున్న ఫార్మాసిస్ట్ మృతిచెందిన సంఘటనపై ఆదివారం ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసుస్టేషన్ నందు కేసునమోదైంది. నగరంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన మేకల సాయిరామ్(26)ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఫార్మాసిస్టుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 19న విధులు ముగించుకోని ఇంటికి వెళ్లేదారిలో మామిడి తోటలో పురుగులమందు తాగి పడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి పున్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న యాదగిరిరావు

కూసుమంచి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరిరావు కోరారు. ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల సోమయ్య అధ్యక్షతన కూసుమంచిలో నిర్వహించిన తొలి, మలి ఉద్యమకారుల ఆత్మీయసమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల బలిదానాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నాటి బీఆర్ఎస్ నియంత పాలనలో ఉద్యమ ద్రోహులను అందలం ఎక్కించడంతో ప్రజలు చరమగీతం పాడారని గుర్తు చేశారు. అందుకు ఫలితంగా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు పెన్షన్లు, ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది దాటినా ముఖ్యమంత్రి అమలు చేయడం లేదని తెలిపారు. ఉద్యమకారులను విస్మరిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. బత్తుల సోమయ్య మాట్లాడుతు ప్రస్తుత ఎమ్మెల్సీతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంసాధించాలంటే ఉద్యమకారుల మద్దతు అవసరం అన్నారు. సామాజిక తెలంగాణ ఏర్పాటుకావాలని, ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు ప్రఫుల్‌రెడ్డి, మాధవీరెడ్డి, అన్వర్‌పటేల్, తుల్జారెడ్డిరాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచితంగా కృత్రిమ కాలు



కొలతలు తీసుకుంటున్న సభ్యులు

భద్రాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం, రోటరీ ట్రస్ట్ ఖమ్మం, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, స్పాన్సర్ యూఎస్ఏకు చెందిన సంస్థ ఆధ్వర్యంలో ప్రమాదవశాత్తు ఒక కాలు లేక రెండు కాళ్లు కోల్పోయిన వారికి ఉచితంగా కృత్రిమ కాలు ఇవ్వడానికి కొలతలు తీసుకున్నారు. పసుమర్తి రంగారావు, సుధాకర్, పదివేల భూషణ్‌రావు ఖమ్మం క్లబ్ నుంచి రాగా ఆదివారం సుమారుగా 90మంది లబ్ధిదారులు హాజరయ్యారు. వాని వద్ద నుంచి నిపుణులు కాలు కోల్పోయిన వారి కొలతలు స్వీకరించారు. మార్చి నెలాఖరులోపు ఆర్టిఫిషల్ లిమ్స్ అందజేయనున్నారు.

### పది నెలలుగా వాచ్‌మన్‌కు అందని వేతనం



నర్సరీలో హుస్సేన్

పెనుబల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో తాళ్లపెంట గ్రామంలో ఏర్పాటుచేసిన సెంట్రల్ నర్సరీ వాచ్‌మన్ షేక్ హుస్సేన్ పది నెలలుగా వేతనం అందడం లేదని వాపోతున్నాడు. గత 12ఏళ్లుగా నర్సరీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తనకు పదినెలలుగా వేతనం రాకపోవడంతో కుటుంబపోషణ ఇబ్బందికరంగా మారిందని, అధికారులను వేతనం కోసం సంప్రదిస్తే హైదరాబాద్ నుంచి రావాలని, వచ్చే వరకు మేము ఏమీ చేసేది లేదని అంటున్నారని వాపోతున్నాడు. గతంలో ఎప్పుడు ఇన్ని నెలల వేతనాన్ని అధికారులు ఆపలేదని, నర్సరీని ఎప్పటికప్పుడు మొక్కలను పెంచడంలో పనిచేస్తున్నానని, ఈ ఏడాది పదినెలల వేతనం లేక అనేక ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని జిల్లా అధికారులు స్పందించి తనకు వేతనాన్ని మంజూరు చేయాలని హుస్సేన్ కోరుతున్నాడు.

## గిరి విద్యార్థులకు ప్రోత్సాహక పరీక్ష

భద్రాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి: ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని, నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రతిభ ప్రోత్సాహక పరీక్షను ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహించారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదుగడానికి ప్రతిభ ప్రోత్సాహక పరీక్షల నిర్వహణ ఎంతగానో ఉపయోగపడుతుందని భావించి ఐటీడీఏ పీవో బి. రాహుల్ తొలిసారిగా ఈ పరీక్షలను ఐటీడీఏ పరిధిలో నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం భద్రాచలంలోని ఏజీహెచ్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకురాలు మణెమ్మ సందర్శించారు. పరీక్షలు రాయడానికి వచ్చే బాలికలకు సూచనలు ఇస్తూ ఎటువంటి భయాందోళనలు మనసులో పెట్టుకోకుండ మీలో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రతిభను వెలికి తీసి నిర్భయంగా పరీక్షలు రాసి అత్యుత్తమ ర్యాంకులు తెచ్చుకోవాలన్నారు. ఈ పరీక్షలు పదో తరగతి తర్వాత మీరు రాసే కాంపిటేటివ్ పరీక్షలు జేఈఈ, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలు రాయడానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఈ ప్రతిభ ప్రోత్సాహక పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థినీలకు ఉపాధ్యాయులు కానీ ఇన్విజిలేటర్లు కానీ ఎవరు సహాయ, సహకారాలు అందించవద్దని, పిల్లలు వారి ప్రతిభ ద్వారానే సొంతంగా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. గ్రూప్స్ పరీక్షలు ఏ విధంగా పకడ్బందీగా నిర్వహిస్తారో ఆ విధంగా నిర్వహించేటట్లు చూడాలని పరీక్ష కేంద్రం స్క్వాడ్, స్పెషల్ ఆఫీసర్ ఎటీ డీవో చంద్రమోహన్‌కు ఆదేశించారు. పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఎవరు పరీక్ష హాలులోకి రాకుండ సంబంధిత స్క్వాడ్ చూడాలని, ఎటువంటి అవకతవకలు పాల్పడకుండ ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు, పరీక్షలు రాసేలా చూడాలన్నారు. మొత్తం 335 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**పాల్వంచలో..**

పాల్వంచ: పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి భవిష్యత్తులో కాంపిటేటివ్ పరీక్షలు రాయడానికి ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలు వారి జీవితాలకు తొలిమెట్టు అని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఆదివారం పాల్వంచ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా ప్రోత్సాహక పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని సూచనలు చేసారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పూర్తి అయిన తరువాత పై చదువులు చదవడానికి ఎన్నో కాంపిటేటివ్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని, అటువంటి పరీక్షలు సులభంగా రాయడానికి ఇటువంటి ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు పిల్లలు తమ మేధాశక్తికి పదునుపెట్టి పరీక్షలు రాసేలా చూడాలన్నారు. గ్రూప్ పరీక్షలు ఎంత పగడ్బందీగా నిర్వహిస్తామో అలానే ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలను సైతం నిర్వహించాలని స్క్వాడ్, స్పెషల్ ఆఫీసర్ ఏటీడీఓ అశోక్‌ను ఆదేశించారు. పరీక్షల్లో మెరిట్ తెచ్చుకున్న విద్యార్థులపై చదువులకు ఐటీడీఏ ద్వారా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భద్రు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పాల్వంచలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న పీవో రాహుల్

## గందరగోళంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

పరీక్షా కేంద్రానికి వెళ్లి వెనుదిరిగిన విద్యార్థులు

జోనల్ పరిధిలో ఐదుగురు విద్యార్థులకు ఎదురుదెబ్బ

భద్రాద్రి జోన్‌లో 77 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల ప్రవేశ పరీక్ష గందరగోళంగా ముగిసింది. ఖమ్మం జిల్లాలో 18 సెంటర్లు, భద్రాద్రి కొత్తగూడెంలో 18, మహబూబాబాద్‌లో 15సెంటర్లు, హనుమకొండలో 16, వరంగల్ జిల్లాలో 10సెంటర్లు మొత్తం 77 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కాగా భద్రాద్రి జోనల్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఐదుగురు విద్యార్థులకు భంగపాటు ఎదురైంది. దరఖాస్తుల సమయంలోనే ఆదాయ ధ్రువీకరణ పరిశీలించాల్సిన అధికారులు తీరా హాల్ టిక్కెట్లు పంపిణీ చేసి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను అధిక ఆదాయ పరిధిలో ఉన్నారని అడ్డుకున్నారు. ఇలా ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో మోదుగు కృష్ణమోహన్ (హాల్ టిక్కెట్ నెంబర్ 5251611000205) అనే విద్యార్థి కుటుంబం ఆదాయం రూ.2లక్షలకు పైగా ఉందని పరీక్షా కేంద్రంలో విద్యార్థి పరీక్ష రాయకుండా సిబ్బంది అడ్డుకున్నారు. ఇతర జిల్లాలో మరో నలుగురు విద్యార్థులను కూడా ఇదే కారణంతో పరీక్షా కేంద్రం నుంచి వెనక్కు పంపారు. అయితే హాల్ టిక్కెట్ మంజూరు చేసి, విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్దకు వచ్చిన తర్వాత అడ్డుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి జోనల్ పరిధిలో మొత్తం 24,556 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. 5వ తరగతి ప్రవేశానికి 12,806 మంది, 6వ తరగతికి 4,881 మంది, 7వ తరగతికి 2,758 మంది, 8వ తరగతికి 2,410, 9వ తరగతికి 1701 మంది విద్యార్థులు హాజరయ్యారు. 761 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



పరీక్ష రాయలేకపోయిన విద్యార్థి

**97శాతం మంది హాజరు**

రఘునాథపాలెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన అర్హతా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 5నుంచి 8వ తరగతిలో విద్యార్థులు చేరేందుకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ఏర్పాటు చేశారు. మొత్తం 352 మంది విద్యార్థులకు గాను 340 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ మల్లేల బాలస్వామి ప్రకటించారు.

## చెరువులో చేపల మృత్యువాత

బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లను మేతగా వేశారని అనుమానం

సత్తుపల్లి మండలం సిద్ధారంలో ఘటన

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నీరు కలుషితం అవ్వడమో.. బర్డ్ ఫ్లూ వైరస్ సోకినందువల్లనో గానీ ఆ చెరువులో చేపలన్నీ మృత్యువాతకు గురయ్యాయి. ఈ చనిపోయిన చేపలను నిర్వహకులు ప్రజలకు ఎంచక్కా కేజీల లెక్క విక్రయించి సొమ్ము చేసుకున్న సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని సిద్ధారంలోని ఏనుగుల చెరువులో వేలాది చేపలు మృతిచెందాయి. అయితే వీటికి మేతకోసం ఎక్కువగా కోడిమాంసం, వ్యర్థాలు, ఇతర దానా వేస్తుంటారు. ఈ నేపథ్యంలో బర్డ్ ఫ్లూ వైరస్ సోకి చనిపోయిన కోళ్లను ఈ చెరువులో చేపలకు మేతగా వేసి ఉంటారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదైన కారణంతో నీరు కలుషితం అయిందా అన్న అనుమానం కూడా వ్యక్తమవుతోంది. చేపలకు సైతం రోగాలు కూడా వస్తుంటాయని, వాటికి ఆక్సిజన్ తక్కువైనప్పుడు తలలు నీటిపైకి వచ్చి చనిపోతుంటాయనే విషయాన్ని ఫిషరీస్ అధికారులు చెబుతున్నారు. ఆదివారం కావడంతో ఈ చనిపోయిన చేపలను నిర్వహకులు మాసంప్రియులకు ఎంచక్కా గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అయితే చనిపోయిన చేపలను విషయం తెలియకుండా ఎందుకు అమ్మారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై పశు సంవర్ధకశాఖ సహాయ ఉప సంచాలకులు డాక్టర్ కే.ప్రదీప్‌కుమార్‌ను వివరణ కోరగా చేపలు ఎందువలన చనిపోయాయో పరీక్షలు నిర్వహిస్తేనే తెలుతుందని, బర్డ్ ఫ్లూ వైరస్ సోకిన కోళ్లను ఇతర జీవాలకు ఆహారంగా వేయకూడదని తెలిపారు.



చెరువులో మృతిచెందిన చేపలు





## ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్‌లో రేపు జాబ్‌మేళా

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీకళాశాలలో ఈనెల25న తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు.మ్యాజిక్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీసర్వీస్, బ్యాంకింగ్, బీపీఓ విభాగాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీపూర్తి చేసిన, డిగ్రీ చివరి సంవత్సరం చదివే వారు తోపాటు 2021 నుంచి 2025 వార్షిక విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.

## వధూవరులకు తుమ్మల ఆశీర్వాదం



నేలకొండపల్లి,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షైసా శంకర్, మాజీ ఎంపీటీసీల కుమారుడు జగదీష్ వివాహం ఆదివారం ఉదయం సూర్యాపేట జిల్లా, కోదాడలోని ఓక ల్యాణ మండపంలో జరిగింది.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివాహానికి హాజరై వధూవరులు జగదీష్-సుమలతలను ఆశీర్వదించారు. తుమ్మల వెంట సాధు రమేష్‌రెడ్డి ఉన్నారు. నెల్లూరి భద్రయ్యవెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నల్లాని మల్లికార్జునరావు, బొడ్డు బొందయ్య, యడవల్లి సైదులు, కుక్కల హనుమంతరావు వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

కూసుమంచి: కూసుమంచి మండల కాంగ్రెస్ నాయకుడు బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి కుమార్తె నిఖితారెడ్డి- రాకేష్‌రెడ్డి వివాహ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. నూతన దంపతులను మంత్రి ఆశీర్వదించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, దయాకర్‌రెడ్డి, స్వర్ణకుమారి, సాధు రమేష్‌రెడ్డి తదితరులు వధువరులను ఆశీర్వదించారు.

## ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీలు రెండోరోజు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. పోటీలలో భాగంగా శని, ఆదివారాలు క్వాలిఫైయింగ్ రౌండ్ పోటీలను నిర్వహించారు. కాగా సోమవారం నుంచి ప్రధాన పోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు మద్దినేని వెంకటరమణ, చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిల్, డీవైఎస్‌ఓ సునిల్‌రెడ్డి, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ,స్టేడియం టెన్నిస్ కోచ్‌కైలాష్ ఉన్నారు.

## అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడి మృతి



నేలకొండపల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూటాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఏలూరి సురేష్(68) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుఝామున మృతి చెందారు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులున్నారు. గత కొన్ని రోజులుగా సురేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సురేష్ మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి నివాళులర్పించారు.

## నిలువ నీడ లేదు.. తాగేందుకు నీరు లేదు

- రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అగచాట్లు
- నత్తనడకన అభివృద్ధి పనులు
- వేసవి నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఖమ్మంమామిళ్లగూడెం,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి):ఖమ్మం రైల్వేస్టేషన్... నిత్యం 15 నుంచి 20వేల మంది ప్రయాణీకులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు..అయితే స్టేషన్ ఆధునికీకరణ పేరుతో కొనసాగుతున్న పనులతో ప్రయాణీకులకు నిలువ నీడ లేదు.. తాగేందుకు నీళ్లలేక అల్లాడి పోతున్నారు. వేసవి రావడంతో తీరని దాహం గొంతులో... పైన ఎండతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులుమాత్రం చేష్టలుడిగి చూస్తున్నారు.

**రూ 25 కోట్లతో పనులు**

గత 9 నెలలుగా ఖమ్మం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. రూ 25.40కోట్లతో స్టేషన్ మోడల్‌కు కేటాయించారు. ప్లాట్‌ఫారాలు విస్తరణ, మరో కొత్త ఫుట్‌వోవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు, మూడో ప్లాట్‌పారం విస్తరణ, వెయిటింగ్ హాళ్లు, మరుగొడ్లు స్టేషన్‌కు నూతన భవన నిర్మాణాలు పనులను చేపట్టారు. అయితే ఈ పనులు ప్రయాణీకుల రద్దీకారణంగా నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్లాట్‌ఫారాలపై పాత కప్పులను తొలగించారు. కొత్తగా షెడ్లను వేసేందుకు మాత్రమ తీవ్రంగా జాప్యం అవుతోంది. వేసవి కారణంగా షెడ్ లేకపోవడంతో ప్రయాణీకులు ఎండవేడిమికి తట్టుకోలేక పోతున్నారు. నేల కింద బండలు వేడికి కాళ్లు కాలుతుంటే... పైన ఎండ తీవ్రతకు అల్లాడి పోతున్నారు. అంతేకాదు ప్లాట్‌ఫారాలపై ఉన్న తాగునీటి కుళాయిలను తొలగించడంతో నీటి చుక్కకూడా లేదు. దాహం వేస్తే కొనుక్కొని తాగాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

**నీడ సౌకర్యాన్ని కల్పించాలి**

స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై ప్రయాణీకులు నిలుచునేలా కనీసం అక్కడక్కడా నెట్ షెడ్స్‌ను అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వేసవితీవ్రత నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు. అంతేకాదు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని, ప్రయాణీకులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని కోరుతున్నారు. పనులను కూడా ముమ్మరంగా పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.





ఖమ్మం రైల్వేస్టేషన్‌లో పనులు కొనసాగుతున్న దృశ్యం

## అలరించిన జనరల్ బోగీల నాటిక

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): భాషాసాంస్కృతికశాఖ తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో నెలనెల వెన్నెల నిర్వాహకులు నిర్వహించిన జనరల్‌బోగీలు నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆదివారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో కళాసాంస్కృతిక సంస్థ, ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బోగీలు నాటిక ఆకట్టుకుంది. రాయల్ డాన్స్ అకాడమీ కూచిపూడి నృత్యాలయం మాస్టర్ రాయల్ రాజు బృందం ప్రదర్శించిన జానపద నృత్యం అలరించింది. అభినయ రుద్ర నాట్యాలయం ఖమ్మం నాట్య గురువు ఫణిల్ కనతాల శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహమ్మద్ అజీజ్, డాక్టర్ కావ్యచంద్ యాలముడి, చెరుకూరి రాజి హాజరై మాట్లాడారు. నిర్వాహకులు సుబ్రమణ్యకుమార్, దేవేంద్ర, వి వి అప్పారావు, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, సదానందం పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత ప్రచారం

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 26 మహా శివ రాత్రి పండుగ సందర్భంగా ఆదివారం నగరంలోని పద్మావతి నగర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటి అధ్యక్షుడు సత్యం,సభ్యులు విజయ్, సుజాత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యంతో సమాజ వికాసం

- 'ఉదయ సాహితి' రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సేనాధిపతి



అవార్డులు అందుకున్న కవులతో నిర్వాహకులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసానికి సాహిత్యం దోహదం చేస్తుందని ఉదయ సాహితి తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కవి రచయిత దాస్యం సేనాధిపతి అన్నారు. ఆదివారం నగరంలోని బోడిపుడి విజ్ఞాన కేంద్రంలో ఉదయసాహితి(సాహిత్య వికాస వేదిక) తెలంగాణ రాష్ట్ర సర్వ సభ్య సమావేశం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు.సేనాధిపతి మాట్లాడుతూ సమాజ మార్పును కోరే రచనలు రావాలన్నారు. అందుకు ఉదయ సాహితి వేదికగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో కలల కావడి కవితా సంపుటిని, వెలుగు పూలు పుస్తకాన్ని అతిధులు ఆవిష్కరించారు. ముందుగా భోగోజు ఉపేందర్‌రావు జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వురిమళ్ల సునంద నువేదికను ప్రవేశపెట్టారు. అనంతరం నిర్వమించిన ఆత్మీయ సమ్మేళనంలో అర్హులైన కవులకు, కవితా భూషణ, కవితా విభూషణ, సహస్ర కవితా స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రులు వెంకటలక్ష్మీ, బత్తిన గీతాకుమారి, అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, తాళ్లూరి లక్ష్మీ,ఉదయ సాహితీ సభ్యులు రమాదేవి,శ్రీదేవి,తులసి పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులు పూర్తి కావాలి

- కమిషనర్ అభిషేక్ అగస్త్య



పైప్‌లైన్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలం నాటికి ఖానాపురం ఊరచెర్వు నుంచి మున్నేరు వరకు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులు పూర్తి కావాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఆదివారం ఖమ్మం నగరంలో అమృత్ 2 పథకంలో భాగంగా రూ.85 కోట్లతో నిర్మాణం చేస్తున్న అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులను కమిషనర్ పరిశీలించారు. సెప్టెంబరు 1న కురిసిన భారీవర్షానికి ఖమ్మంలోని మైదాన ప్రాంతంలోని డివిజన్లు వరద ముంపునకు గురైనాయి. మరోవైపు పాండురంగాపురం, బల్లేపల్లి, బాలపేట, ఖానాపురం, చైతన్యనగర్, ప్రశాంతినగర్, లెనిన్ నగర్, ఇతర ప్రాంతాల వ్యర్థాలు ఖానాపురం చెర్వు నుంచి మున్నేరు వరకు వరద నీటిలో కలిసి ప్రవహిస్తున్నారు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని అమృత్ పథకంలో బాగంగా రూ.85 కోట్లు మంజూరు చేయించారు. ఖానాపురం అమృత్ 2 పథకంలో బాగంగా అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులు పక్షం రోజుల క్రితమే ప్రారంభించారు. ఖానాపురం చెర్వునుంచి పనులు ప్రారంభమై కొంతమేరా ముందుకు వచ్చాయి. అండర్‌గ్రౌండ్ పైప్ లైన్‌తో పాటుగా రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మాణం చేస్తున్నారు. ఆయా పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించి, పనులు వేగవంతంగా చేపట్టాలని ఎస్ఈ రంజిత్‌కు సూచించారు.

## ఏలూరిని కలిసిన సంక్షేమాధికారుల సంఘం కమిటీ



ఏలూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సంక్షేమాధికారుల సంఘం అధ్యక్షుడు రుక్మారావు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): టీజీవోస్ రాష్ట్రఅధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావును తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొటపాటి రుక్మారావు ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛాని అందించారు. ఇటీవల సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ నేపథ్యంలో మర్యాదపూర్వకంగా నాయకులు ఏలూరిని కలిశారు. కలిసి పుష్పగుచ్ఛాని అందించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి బుల్లెట్(కొణిదెన) శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, సంక్షేమాధికారుల సంఘం జిల్లా కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావు, నాయకులు ఎన్ విజయ, వీరభద్రరావు, కోమలి, మాధురి, నాగరాజు, నాగమణి, స్టాలిన్, నర్సింహారావు, వరలక్ష్మీ, కరుణాకర్, అబ్దుల్ ముఖిత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్క్ ఫలితాల్లో న్యూవిజన్, హార్వెస్ట్ విజయభేరి

ఖమ్మం ఖానాపురంహవేలి,ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మొదటి విడత బీఆర్క్ పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదల చేశారు. నగరంలో న్యూవిజన్ కళాశాల విద్యార్థులు బీఆర్క్ ఫలితాల్లో ఉత్తమ పర్సంటైల్స్ సాధించారని కళాశాల చైర్మెన్ సీహెచ్‌జీకె ప్రసాద్ తెలిపారు. కళాశాలకు చెందిన అజ్మీర రోషిక్ మణిదీప్ 99.67, ప్రణయ్ 99.67, స్వర్ణమణిస్విక్ 99.72, రమా కౌశిక్ 99.64,అన్వన 99.62, కార్తీక్‌సాయి 99.50, రోసన్ శ్రీహరి మండల, రఘు షణ్ముక ప్రియ 99.27, వి బృహస్పేన 99.23, కే మధురహాసిని 99.12, బ్రాహ్మణి 99.03, ఎం భార్గవ్ సాయి 98.79, ఎం చరణ్‌వెంకట్ 98.76, సీహెచ్ సాయికృష్ణ 98.67 వంటి పర్సంటైల్స్ సాధించారని తెలిపారు. కళాశాల నుంచి 99 శాతం 10 మంది విద్యార్థులు,ఫిజిక్స్‌లో 10మంది 99కు 99 పర్సంటైల్స్ సాధించారని తెలిపారు. ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల చైర్మెన్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, గోపిచంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి శ్రీనివాస్‌లు అభినందించారు. హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు బీఆర్క్ ఫలితాల్లో ఉత్తమశ్రేణి పర్సంటైల్స్ సాధించారని కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీ రెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన నవనీత్ 99.58, సాయినేహా 99.29, జస్వంత్ 99.26, హావింక 99. 22, సాయిచరణ్ 99.096, పర్సంటైల్స్ సాధించారని తెలిపారు.ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలోవిద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన న్యూవిజన్ విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించిన హార్వెస్టు విద్యార్థులు

## డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సామర్థ్యం పెంపు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు తగిన స్థాయిలో విద్యుత్ వ్యవస్థ పరికరాలను అభివృద్ధి చేస్తున్నట్లు టీజీ ఎస్పీడీసీఎల్ ఖమ్మం డివిజనల్ ఇంజనీర్ రామారావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో100కేవీఏ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆయన చార్జ్ చేశారు. దీంతో పాండురంగాపురం, బలేపల్లిలో విద్యుత్ అంతరాయాలు తొలగిపోతాయని తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ రామారావు, ఏడీఈ సంజీవరావు

## మాజీ ఎంపీ నామా పర్యటన

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని నాయుడుపేట,పెద్దతండా గ్రామాల్లో మాజీ ఎంపీ నామానాగేశ్వరరావు ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా నాయుడుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో జరిగిన కల్యాణ వేడుకకు హాజరయ్యారు. తిరుమలాయపాలెం మండలం, గోపాలపురంకు చెందిన త్రివేణికి, నేలకొండపల్లి మండలేనికి చెందిన పారుపల్లి మల్లకార్జునరావు,పద్మల కుమారుడు ఫణి చందుతో వివాహం జరిగింది. ఈసందర్భంగా మాజీ ఎంపీ నామా నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## వైభవంగా సంత్‌సేవాలాల్ ఆలయ శంకుస్థాపన

కల్లూరు,ఫిబ్రవరి23(ఆంధజ్యోతి): క ల్లూరు మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం బంజరా తండా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయ శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి మహారాజ్ (అర్చకుడు) రామ్‌జీ గిరిజన సంప్రదాయకరంగా పూజలు చేసి శంకుస్థాపన క్రతువు నిర్వహించారు.అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరాజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భుక్యా శివకుమార్‌నాయక్, ఏనుగు సత్యంబాబు, తక్కేళ్లపాటి ప్రసాద్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విరాళం అందజేత

పెనుబల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ కాల్వ వద్దనున్న దుర్గామల్లేశ్వరి ఆ లయానికి మహాశివరాత్రి సందర్భంగా గంగదేవిపాడు గ్రా మానికి చెందిన బాణోతు జగన్ రూ.33వేలు వితరణగా ఆదివారం అందించారు. కార్యక్రమంలో బాణోతు కృష్ణ, వేముల వెంకటేశ్వరరావు, వంగా చంద్రశేఖర్, పర్వతం రామకృష్ణ, వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

## అన్నదానానికి వితరణ

పెనుబల్లి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): నీలాద్రీశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే మహాఅన్నప్రసాదానికి టేకులపల్లి గ్రామానికి చెందిన సూర్యదేవర రవికుమార్ రూ.20వేలను అందించారు. ఈ వితరణను ఆదివారం ఆలయ మాజీ డైరెక్టర్ ప్రసాద్ ద్వారా ఈవో వెంకటరమ ణ, చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావులకు అందజేశారు. కార్యక్రమంలో ఆల య కమిటీ సభ్యులు మిట్టపల్లి నరేంద్రకుమార్, వనుకూరి భద్రారెడ్డి, డైరెక్ట ర్లు పాల్గొన్నారు. దేవాదాయశాఖ తరపున 75టీషర్టులను కొత్తగూడేనికి చెందిన వసుంధర సుమంగళి యాజమాన్యం అందజేసినట్లు ఈవో తెలిపారు.

## టీజేఎస్ బోనకల్ అధ్యక్షుడిగా బీరెల్లి వాసు

బోనకల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన బీరెల్లి వాసు టీజేఎస్ మండల అధ్యక్షుడిగా, ఆళ్లపాడుకు చెందిన తాళ్లూరి శ్రీనివాసరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేస్తామని తెలిపారు.

## మనువాద బీజేపీ విధానాలను తిప్పి కొట్టండి

- దళితులంతా ఐక్యం కావాలి
- వివక్ష ఇంకెన్నాళ్లు
- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): దళితులపై ఇంకెన్నాళ్లు వివక్ష కొనసాగుతుందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని నాయుడుపేటలోని ఓఫంక్షన్ హాల్లో పాలేరు డివిజన్ మహాసభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాన్ వెస్లీ హాజరయ్యారు. ఆత్మగౌరవం,సమానత్వం, కుల నిర్మూలన అనే లక్ష్యలాతో ఏర్పడిన సంఘం కేవీపీఎస్ అన్నారు. కేవీపీఎస్ రాష్ట్రంలో వేలాది గ్రామాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై అంటరానితనంపై అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘనత ఉందన్నారు. ఆలయ ప్రవేశాలు, రెండు గ్లాసుల విధానం, గ్రామాల్లో కులంపేరుతో వివక్ష ఇలా అనేక ఘటనలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తోందన్నారు.. స్వతంత్ర భారతదేశంలో నేటికిదళితవాడలు అత్యంత దుర్భరంగా పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఎస్సీ జనాభా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 20వేలకోట్ల రూపాయలు కేటాయించి దళితవాడల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. దేశంలో ఎస్సీలకు సెంట్ భూమి లేకుండా చేసింది బ్రాహ్మణ ఆధిపత్యమే అన్నారు. ఈ దేశంలో దళితులు వెనుకబడటానికి ప్రధాన కారణం మనువాదమేన్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకులు బండి రమేష్ మాట్లాడుతూ మనుషులంతా సమానమేనని ఎటువంటి వివక్ష లేకుండా సోదరభావంతో మెలగాలని పిలుపునిచ్చారు.అనంతరం 25మందితో పాలేరు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుపగిడి కత్తుల నాగేశ్వరరావు, కొమ్ము శ్రీను, జిల్లా నాయకులు నందిపాటి మనోహర్, ఐద్వా రాష్ట్ర నాయకులు మాచర్ల భారతి, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులురమణ,పద్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ బషీరుద్దీన్,వ్యకాస నాయకులు నండ్రా ప్రసాద్, పావిట్ల సత్యనారాయణ, ఉపేందర్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



నాగమణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నామా

### బాధిత కుటుంబానికి
## నామా, పువ్వాడ పరామర్శ

ముదిగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆమె భౌతిక కాయానికి మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. ఆదివారం మేడేపల్లి గ్రామంలో నాగమణి అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా వారు హరిప్రసాద్‌ను ఓదార్చి సానుభూతి, సంతాపం తెలిపారు.

మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి మృతిచెందగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హరిప్రసాద్‌ను ఫోన్లో పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. నాగమణి మృతికి సంతాపం, సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కారేపల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అదివారం సంకల్ప వాలంటరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసీమియా పిల్లల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా నిర్వహించిన శిబిరంలో యువకులు గంగరబోయిన మురళి, జంగా జోగిరెడ్డి, రెంటాల వినోద్‌ల ఆధ్వర్యంలో అనేక మంది యువకులు ముందుకు వచ్చి వారి రక్తాన్ని దానంగా అందజేశారు. రక్తదానం చేసినవారికి ట్రస్ట్‌కు సంబంధించినవారు సర్టిఫికెట్లు అందజేశారు.

## విరాళం అందజేత



జగన్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెనుబల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ కాల్వ వద్దనున్న దుర్గామల్లేశ్వరి ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా రంగులు వేయించేందుకు గంగదేవిపాడు గ్రామానికి చెందిన బాణోతు జగన్ రూ.33వేల నగదును వితరణగా ఆదివారం అందించారు. కార్యక్రమంలో బాణోతు కృష్ణ, వేముల వెంకటేశ్వరరావు, వంగా చంద్రశేఖర్, పర్వతం రామకృష్ణ, వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

చింతకాని, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు నెర్సుల యల్లయ్య కుటుంబానికి మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, కొండా గోపి, ఆలస్యం వీరప్రసాద్, కొరిపల్లి శ్రీను, అనగాని రామారావు, నారపోగు నరసింహారావు, కృష్ణ పాల్గొన్నారు.

## ఏసీ వితరణ

ఎర్రుపాలెం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి గర్భాలయానికి ఓ భక్తుడు ఏసీని బహూకరించాడు. హైదరాబాదుకు చెందిన జీవీకే ప్రసాద్ సుమారు రూ.40వేల విలువ చేసే ఏసీని ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మకు అందించారు. శ్రీవారి గర్భాలయంలో సర్వాంగాభిషేకం, ప్రత్యేకక పూజలు నిర్వహించే క్రమంలో గది ఉష్ణోగ్రతలు నియంత్రించేందుకు ఏసీ ని బహూకరిస్తున్నట్టు తెలిపారు ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ డి.సోమయ్య, అర్చకులు ఉప్పల రాజీవ్‌శర్మ, మారుతి రఘురామకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాపారాలు సాగక..

**» ఆన్‌లైన్ వ్యాపారం, పెద్ద, పెద్ద మాల్స్‌తో మూతబడుతున్న దుకాణాలు**







ఖాళీగా దర్శనమిస్తున్న దుకాణాలు

మధిరటౌన్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మధిర ప్రధాన రోడ్డులో షాపు దొరికితే చాలు ఇక జీవితం సెటిల్ అయినట్లే అనుకునేవారు.. నేడు అదే రోడ్డులో షాపు ఇస్తాం వ్యాపారాలు చేసుకోండీ బాబు అని బిల్డింగ్ యజమానులు పిలుసున్నా అటువైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. మధిరలో మెయిన్ రోడ్డు, వైరా రోడ్డు, స్టేషన్ రోడ్డు ప్రధాన వ్యాపార కూడళ్లుగా ఉండేవి.. ఇక్కడ షాపు దొరకాలంటే రూ.లక్షల్లో అడ్వాన్సులు చెల్లించాల్సిన పరిస్థితులు ఉండేవి. కరోనాతో దివాలు తీసిన వ్యాపారాలు ఆ తరువాత కూడా కోలుకోక మరింత కుదేలు అయ్యాయి. కరోనా సమయంలో ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడిన ప్రజలు ఆ తరువాత కూడా ఏది కోనాలన్నా ఆన్‌లైన్‌లో కొనేందుకే మొగ్గు చుపుతున్నారు. మొదట ఎలక్ట్రానిక్ వస్తువులు కోనేందుకు అలవాటు పడిన ప్రజలు, తరువాత దుస్తులు, చెప్పులు, కిరాణా సరుకులు కూడా ఆన్‌లైన్ లోనే కొనేందుకు అలవాటు పడడంతో స్థానిక వ్యాపారులకు వ్యాపారాలే లేకుండా పోయాయి. అందుకు తోడు మధిరకు పెద్ద మాల్స్ కూడా రావడంతో, ఒకో రోజు బోణీ కూడా కాకపోవడంతో పలువురు తమ వ్యాపారాలు మూసివేయడంతో మధిరలో మెయిన్ సెంటర్లలో కూడా షాపులకు టూలెట్ బోర్డులు పెట్టి అద్దెకు వచ్చే వారి కోసం ఎదురు చూసే పరిస్థితులు నెలకొన్నాయి, ఒక్క మెయిన్ రోడ్డులోనే దాదా పు 16షాపుల ముందు టూ లెట్ బోర్డులు వేలాడుతున్నాయి.

### ఆన్‌లైన్ వ్యాపారం బాగా దెబ్బ తీసింది
**● ఊట్ల వేణు, మొబైల్ వ్యాపారి**



ఆన్‌లైన్ వ్యాపారాలకు ప్రజలు బాగా అలవాటు పడ్డారు. ఒకప్పుడు వారానికి ఒక ఆన్‌లైన్ డెలివరీ వ్యాన్ మధిరకు వచ్చేది. నేడు రోజుకు నాలుగు వ్యాన్‌లు వస్తున్నాయి. దీనితో వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి, ఒకప్పుడు మా దుకాణంలో ఎనిమిది మంది స్థానికులు పనిచేసేవారు, నేడు ఇద్దరితోనే సరిపుచ్చుతున్నాం. దీంతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గాయి.

### స్వయం ఉపాధి కోల్పోయాం..
**● శివ కుమార్, చెప్పుల వ్యాపారి**



ఆన్‌లైన్‌తో పాటు ఉచిత బస్సు కూడా వ్యాపారాలను దెబ్బతీసింది, ప్రజలు ఏమి కోనాలన్నా ఖమ్మం వంటి పెద్ద సెంటర్లకు పోయి కొంటున్నారు. దీంతో స్వయం ఉపాధి పోందేవారు వ్యాపారాలు లేక దివాలు తీసే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వాలు ఆలోచించి వ్యాపారులను నిలబెట్టేలా ప్రయత్నం చేయాలి. వ్యాపారాలు లేక పలు చోట్ల దుకాణాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.



సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా సంత్‌సేవాలాల్ ఆలయ శంకుస్థాపన

కల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం బంజరా తండా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయ శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి మహారాజ్ (అర్చకుడు) రామ్‌జీ గిరిజన సంప్రదాయకరంగా పూజలు చేసి శంకుస్థాపన క్రతువు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భుక్యా శివకుమార్‌నాయక్, ఏనుగు సత్యం బాబు, తక్కేళ్లపాటి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు టీపీ ప్రసాద్, భుక్యా కృష్ణ, గుగులోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక మహాసభను జయప్రదం చేయండి

**» ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు**

సత్తుపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని అల్లిపురం-కొత్తగూడెంలో మార్చి 1వ తేదీన జరుగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘ 4జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన సత్తుపల్లిలో ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డుకు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కార్మికులకు తీరని అన్యాయం జరగ్గా ఇప్పటి ప్రభుత్వాలు సైతం తమను పక్కనబెట్టి పాలన సాగిస్తుందన్నారు. 1996లో అప్పటి కేంద్రమంత్రులు, ఎంపీల పోరాట ఫలితంగా సంక్షేమ బోర్డు ఏర్పడగా పశ్చిమ బెంగాల్, త్రిపుర, కేరళ, తమిళనాడు రాష్ట్రాలో అమల్లోకి రాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో సంక్షేమ బోర్డు అమలులోకి వచ్చిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్మికుల సంక్షేమం కోసం ఆ బోర్డు పనిచేస్తుందని, ఇప్పటివరకు దాదాపు 18లక్షల మంది సభ్యులుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గాదె లక్ష్మీనారాయణ, నమ్మిటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, కుమార్ తదితరులున్నారు.




మాట్లాడుతున్న రామాంజనేయులు

## తల్లాడలో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

తల్లాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని, సత్తుపల్లి నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, నాయకులు దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్, గోవిందు శ్రీనివాసరావు, దగ్గుల నాగిరెడ్డి, వడ్డే రామారావు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

## ఘనంగా సీతారాముల కల్యాణం

వైరా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైరాలోని దాసాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకుడు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, ఆలయ కమిటీ నిర్వాహకులు చావా శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతనిప్పు వెంకటయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు శ్రీరామనేని రామస్వామి, షేక్.సోందుసాహెబ్, ఊరకొండ వెంకటేశ్వరరావు, కొత్తూరి రమణ, సూర్యదేవర శ్రీధర్, ఏలూరి వెంకటేశ్వరరావు, మైదపల్లి జగన్మోహన్‌రావు, ఏలూరి నర్సింహారావు పాల్గొన్నారు.



సీతారామ కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

### మధిరలో భావన రుషి కల్యాణం

మధిరటౌన్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల ఆరాధ్య దైవమైన శ్రీ భద్రావతి భావన రుషి కల్యాణాన్ని ఆదివారం మడుపల్లి లో గల దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాఘ మాసం బహుళ దశమి రోజు ఈ కల్యాణం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యలమద్ది రాము, జల్లా రామకృష్ణ, ఉద్దండయ్య, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## అన్నదానానికి నగదు వితరణ

పెనుబల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నీలాద్రీశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే మహాఅన్నప్రసాదానికి టేకులపల్లి గ్రామానికి చెందిన సూర్యదేవర రవికుమార్ రూ.20వేలను అందించారు. ఈ వితరణను ఆదివారం ఆలయ మాజీ డైరెక్టర్ ప్రసాద్ ద్వారా ఈవో వెంకటరమణ, చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మిట్టపల్లి నరేంద్రకుమార్, వనుకూరి భద్రారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు. దేవాదాయశాఖ తరపున 75టీషర్టులను కొత్తగూడేనికి చెందిన వసుంధర సుమంగళి యాజమాన్యం అందజేసినట్లు ఈవో తెలిపారు.

### ఉత్సవ నిర్వహణకు కమిటీ ఏర్పాటు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నీలాద్రీశ్వర ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు 14మంది సభ్యులతో జిల్లా అధికారులు కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వెంకటరమణ తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా లింగగూడెం గ్రామానికి చెందిన చీకటి చిన్ననర్సింహారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

కల్లూరు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి కామన్ ఎంట్రెన్స్, 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లకు భర్తీకి గాను పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. 634 మంది అభ్యర్థులకు 626 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్లుగా ప్రిన్సిపాల్ కనకదుర్గ తెలిపారు.

### వైరాలో..

వైరా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఎంట్రెన్స్ టెస్టుకు 393 మంది విద్యార్థులు హాజరయ్యారు. వైరాలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీలో ఆదివారం జరిగిన ఎంట్రెన్స్‌లో మొత్తం 399 మందికిగానూ 393మంది విద్యార్థులు హాజరయ్యారు.

## అంజయ్య ఆశయాలు సాధించాలి

**» సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



అంజయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సురేష్

కొణిజర్ల, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): యువత ప్రజా సమస్యలపై స్పందించి పోరాడాలని, అంజయ్య వంటి యువనేతలను కోల్పోవడం కమ్యూనిస్టుపార్టీకి తీరని లోటు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కొనియాడారు. మండల పరిధిలోని తనికెళ్లలో ఆదివారం మంచికంటి అంజయ్య 4వ వర్ధంతి సభను నిర్వహించారు. అంజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యర్రాబాబు, దొండపాటి రమేష్, పీవీరావు, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గడల శ్రీను, పొట్లపల్లి సరవయ్య, పాపిట్ల ఏసు, రత్తమయ్య, యసా వెంకటేశ్వరరావు, కొనపర్తి విష్ణుమూర్తి, లేడిబోయిన గోపాల్‌రావు, గడల భాస్కర్‌రావు, చల్లా నారాయణ, పొట్లపల్లి సీతరాములు, శంకర్‌రావు, వెంకటేశ్వర్లు, గాంధీ, విజయ్ పాల్గొన్నారు.

## 'ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి'

వైరా, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డులో విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని మాజీ ఎంపీపీ బొంతు సమత అన్నారు. వైరా గురుకుల పాఠశాల నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు ఇరువైపులా గృహాలు, షాపుల్లో దుమ్ము పేరుకుపోయి ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మట్టి, గ్రావెల్ పనులు జరిగేటప్పుడు ట్యాంకర్ల ద్వారా నీరు చల్లాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు విస్తరణ పనులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

## శరవేగంగా కోదండరామాలయ నిర్మాణం

ఏన్కూరు, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం గ్రామంలోని నూతన కోదండ రామాలయం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతేడాది డిసెంబరు 26న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాతలు, గ్రామస్థులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## సోమలింగేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠ

తల్లాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పినపాక గ్రామంలో సోమలింగేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠ మహోత్సవానికి తల్లాడ పరిసర మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టీజేఎస్ మండల అధ్యక్షుడిగా బీరెల్లి వాసు



బోనకల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన బీరెల్లి వాసు టీజేఎస్ మండల అధ్యక్షుడిగా, ఆళ్లపాడుకు చెందిన తాళ్లూరి శ్రీనివాసరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం అంకితబావంతో పని చేస్తామని తెలిపారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలను పూర్తిగా అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తమకు పదవులు ఇచ్చిన టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు సర్దార్ హు స్సేన్, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి గోపగాని శంకర్రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముస్తాబవుతున్న శివాలయాలు




పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని బుగ్గపాడులోని శ్రీ విశ్వధర్మక్షేత్రంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వెల్లటూరి ప్రసాదాచారి తెలిపారు. రాత్రి 108దంపతులచే శివకల్యాణం, అఖండ శివనామస్మరణ భవన, లింగోద్భవ సమయంలో బస్మాభిషేకం, త్రిశూల స్నానం వంటి కార్యక్రమాలు శైవాగమోక్తంగా నిర్వహించనున్నామన్నారు. పీటలపై కూర్చును దంపతులు 9000522248ను సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు తుమ్మూరి ప్రసాద్‌బాబు కోరారు.

### కల్లూరులో..

కల్లూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కల్లూరులో (పుల్లయ్యబంజర) అత్యంత చారిత్రక ప్రాముఖ్యత గల శ్రీ శివాలయం (అప్పయ్యస్వామి), శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రంలో ఈ నెల 25 నుంచి 27 తేది వరకు జరగనున్న మహాశివరాత్రి జాతరకు భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. కాకతీయ కాలంలో సుమారు 11 వశతాబ్దములో ఈ ఆలయం వెలసినది. ఈ ఆలయం ఇటీవల కాలంలో శిథిలావస్థకు చేరుకోవటంతో దేవాదాయ శాఖ, కాకతీయ షుగర్స్ వారి సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఈ నెల 25న ప్రత్యేక పూజలు, 26న మహాశివరాత్రి సందర్భంగా పూజలు, 27న సాయంత్రం 7 గంటలకు శ్రీస్వామి వారి తెపోత్సవం నిర్వహించనున్నారని ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, ఈవో ఎస్‌వీడీ ప్రసాద్‌లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రసాదరెడ్డి సోదరులు తమ వంతుగా ఆర్థికంగా చేయూతనిచ్చారు. స్థానిక ప్రముఖులు కిష్టంశెట్టి కొండలు, పెద్ద బోయన నరిసింహారావు, మాడిశెట్టి శ్రీనివాసరావు, బండేల కృష్ణయ్య, బుర్రి వీరయ్య, కిష్టంశెట్టి నరిసింహారావులు ప్రత్యేకంగా ఆలయంలో గత నాలుగు రోజుల నుంచి జాతర ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నారు.



కల్లూరులో జాతరకు ముస్తాబైన కాశ్మీర మహాదేవ క్షేత్రం

### మధిరటౌన్‌లో...



ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

మధిరటౌన్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మధిర లోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ మృత్యుంజయ స్వామి దేవాలయం లో మహాశివరాత్రి సందర్భంగా రేపటి నుండి నిర్వహించే జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 9గంటలకు స్వామి వారు, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసే కార్యక్రమం, రాత్రి 12 గంటలకు మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బం ది కలుగకుండా ఆలయం ముందు చలువ పందిరి ఏర్పాటు చేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోనకల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామంలో ఆదివారం గత 2000-2001 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదిక పై కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సామూహికంగా భోజనాలు చేశారు.

కారేపల్లి, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదవతరగతి చదివిన నాటి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు.

తల్లాడ, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): తల్లాడలోని జడ్పీ ఉన్నత పాఠశాల 1985-86బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనుభవాలను పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



బోనకల్ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కారేపల్లిలో....



తల్లాడలో...